RNI NO. APTELL/ 2006/18110

## అల్పపీడనం ఎఫెక్ట్.. తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎలా ఉంటుంది..

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలమైన అల్పపీడనంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సెప్టెంబర్ 7 వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో వర్షాలతో పాటు గంటకు 30--40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

## మళ్లీ తగ్గుముఖం పడుతున్న బంగారం, వెండి ధరలు..


ఆగస్టు చివరి వారంలో బంగారం ధరలు గరిష్ఠాల నుంచి దిగొచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి, డాలర్, బాండ్ ఈల్డ్స్ బలపడటం, లాభాల స్వీకరణతో పసిడి అమ్మకాలు తగ్గాయి. ఆగస్టు 31 నుంచి ప్రారంభమయ్యే వారంలో బంగారం ధరలు ఏ దిశగా కదులుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 283 మంగళవారం 01 సెప్టెంబర్ 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥1/-

## పెట్రోల్‌లో ఇథనాల్ శాతం ఎంత..

### బిల్లులపై వివరాలు ఉండాలి.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ఇథనాల్ శాతం వెల్లడించాలంటూ పిటిషన్ సుప్రీంకోర్టు వ్యాజ్యం స్వీకరించలేదు హైకోర్టును ఆశ్రయించాలని సూచన**




పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఎంత శాతం ఇథనాల్ ఉందో తప్పనిసరిగా ప్రదర్శించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. అయితే, వినియోగదారుల పారదర్శకతకు సంబంధించిన ఈ అంశంపై పిటిషనర్ సంబంధిత హైకోర్టును కానీ, సమర్థిక అధికారాన్ని కానీ ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. అడ్వొకేట్ నరేంద్ర కుమార్ గోస్వామి దాఖలు చేసిన ఈ పిటిషన్, వినియోగదారులకు ఇంధనంపై ఉన్న హక్కులను ప్రధానంగా ప్రస్తావించింది. పెట్రోల్ బంకుల్లోని డిస్పెన్సింగ్ నాజిల్స్‌పై, కస్టమర్లకు ఇచ్చే రసీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని పిటిషనర్ కోరారు. తాము కొనుగోలు చేస్తున్న ఇంధనం నాణ్యత, అందులోని మిశ్రమాల వివరాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని వాదించారు. ఈ పిటిషన్ ప్రభుత్వ ఈ20 విధానానికి వ్యతిరేకం కాదని, కేవలం పారదర్శకత పెంచడం, వినియోగదారుల్లో అవగాహన కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.



# సరికొత్త పారిశ్రామిక విప్లవం

హైదరాబాద్:ఆగస్టు 31: తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తెలంగాణ రైజింగ్--2047 విజన్‌కు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానాలకు రూపకల్పన చేస్తోంది. ప్రస్తుత పారిశ్రామిక విధానానికి దాదాపు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 'ఇండస్ట్రియల్ పాలసీ 2.0'ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతికత ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు సృష్టించడం ఈ కొత్త విధానాల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలు, టైర్-2, టైర్-3 నగరాలకు పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది.ఇండస్ట్రియల్ పాలసీ 2.0లో భాగంగా మొత్తం 10 కీలక రంగాలకు ప్రత్యేక విధానాలను రూపొందించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన కొత్త విధానం ప్రకటించగా.. మిగిలిన రంగాలపై కసరత్తు కొనసాగుతోంది.లాజిస్టిక్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఫుట్‌వేర్--లెదర్, అప్పెరల్--లైఫ్‌స్టైల్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, డేటా సెంటర్స్, ఆటోమొబైల్ రంగాలు ఇందులో ఉన్నాయి.కొత్త పారిశ్రామిక విధానాల్లో పెట్టుబడి విలువ ఒక్కటినే ప్రాతిపదికగా తీసుకోకుండా.. ఉద్యోగాల కల్పన, తయారీ సామర్థ్యం, ఎగుమతులు, స్థానికంగా ఏర్పడే విలువ, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

2లో

# కవితకు అడుగడుగునా నీరాజనం

## జనసంద్రంగా మారిన పాంచజన్య సంకల్పసభ.






నిజామాబాద్ సిటీ ఆగస్టు 31 (ప్రజాగళం) నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేసిన పాంచ జన్య సంకల్ప సభ జనసంద్రంగా మారింది. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ముందుగా ఇందల్వాయి టోల్గేట్ వద్ద ప్రజలు ఆమెకు స్వాగతం పలికి అక్కడి నుండి మాధవ నగర్ సాయిబాబా టెంపుల్ మీదుగా బోర్గం వరకు చేరుకున్న తర్వాత అక్కడ మహిళలు టీఆర్ఎస్ నాయకులు గజమాలతో ఆమెకు స్వాగతం పలికారు. అక్కడినుండి ర్యాలీగా ప్రారంభమై పులాంగ్ మీదుగా ఆర్ఆర్ చౌరస్తా, నెహ్రూ పార్కు గాంధీ చౌక్ మీదుగా ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ కు చేరుకున్నారు. ర్యాలీలో ప్రజలు ఆమెకు ఘనంగా స్వాగతం స్వాగతం పలికారు. మహిళలు బోనాలతో ఆమెకు స్వాగతం పలికినప్పుడు ఆనందోత్సవాలలో కవిత మునిగిపోయారు ఆమె ఆనందానికి హద్దులు లేవని సంతోషం వ్యక్తం చేశారు. కవిత సభ స్థలానికి చేరుకోగానే జనము పెద్ద ఎత్తున కేకలు వేసి స్వాగతం పలికారు. ముందు వరసలో ఉన్న ప్రతి మహిళకు కరచాలన చేశారు.

# రూ.8 లక్షల కోట్ల అప్పు

## ఇదే కేసీఆర్ మార్క్ పాలన: సీఎం రేవంత్

హైదరాబాద్ లో పెరిగిపోతున్న ట్రాఫిక్ కి చెక్ పెట్టె క్రమంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది.ముఖ్యంగా తూర్పు హైదరాబాద్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈరోజు ఘనంగా ప్రారంభించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఆధ్వర్యంలో మూసీ నదిపై దాదాపు రూ.52 కోట్ల భారీ అంచనా వ్యయంతో 400 మీటర్ల పొడవైనతో అంబర్ పేట నుండి ప్రయాణ సమయం తగ్గడంతో పాటు.. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ కూడా కొంతమేర తగ్గే అవకాశం ఉంది.ఇక ఈ ప్రారంభోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పై ఒక రేంజ్ లో ఫైర్ అయ్యారు.

2లో



**తెలంగాణ రాష్ట్ర సాధనలో గైని పాత్ర కీలకం.**

3లో

# వెయ్యి రోజుల రగడ



- పోటాపోటీ వారోత్సవ పోరాటాలు
- నా బంగారు పుట్టలో వేలు పెడితే
- నీ ఫామ్‌హౌజ్‌ను కుట్టనా?

మా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టమా? అన్నట్టుగానే ఉంది బీఆరెస్‌పై కాంగ్రెస్ నేతల కౌంటర్ ఎటాక్. మీరు మా ప్రజా పాలనను విమర్శిస్తారా? ప్రశ్నిస్తారా? అయితే కాస్కోండని ఫామ్‌హౌజ్‌కు పొగ పెట్టడం మొదలు పెట్టారు. కలుగులోంచి ఎలుకను బయటకు రప్పించాలంటే పొగబెట్టే ప్రయత్నం మొదలైంది. ఇది గెలికి కయ్యం పెట్టుకున్నట్టుగా తయారయ్యింది పరిస్థితి. మా వెయ్యి రోజల పాలనను తప్పుబడతారా? దీనిపై నిరసనలు కూడా చేస్తారా? అయితే మిమ్మల్ని ఎక్కడ కొట్టాలో అక్కడే కొడతాం ఉండుర్రి బిడ్డా..! అన్నట్టుగానే అప్పుడే కాంగ్రెస్ నుంచి కౌంటర్ ఎటాక్ మొదలయ్యింది. ఏకంగా సీఎం రేవంత్ దీనిపై ఘాటుగా స్పందించిన తీరు కూడా బీఆరెస్ ఇచ్చిన పిలుపును కాంగ్రెస్ సర్కార్ అంత ఆషామాషీగా తీసుకోలేదని తెలుస్తోంది. ముసారాంబాగ్ బ్రిడ్జిని ప్రారంభించిన సభలో సీఎం ఈ టాపిక్ మీద దాదాపుగా గంట పాటు బీఆరెస్‌ను ఎడాపెడా క్లాస్ పీకిన వైనం. విమర్శించిన తీరు. ఎండగట్టిన విధానం.. పరిస్థితి తీవ్రతను తెలియజేసింది.

2లో

# సబ్బండ వర్గాల సంక్షేమమే మా పార్టీ ధ్యేయం.

- మీ కోడలిగా వచ్చా ఆశీర్వదించండి.
- తల్లి బిడ్డను విడదీసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి నా ఉసురు తగులుతుంది.
- పాంచ జన్య సభలో కన్నీరు పెట్టిన కవిత.



2లో

నిజామాబాద్ ఆగస్టు 31 (ప్రజాగళం ప్రతినిధి ) సబ్బండ వర్గాల సంక్షేమమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ధ్యేయమని కల్వకుంట్ల కవిత అన్నారు. మీ కూడలిగా నిజాంబాద్ కు వచ్చానని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఆమె కోరారు. టిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన పాంచ జన్య సంకల్ప సభలో కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తండ్రి, బిడ్డను విడదీశారని ఆయనకు నా ఉసురు తగులుతుందని ఆమె అన్నారు. ప్రశాంత్ రెడ్డి ఎదుగుదలకు తాను ఎంతో కృషి చేశానని, మంత్రి మంత్రిగా ఎదగడానికి నా పాత్ర ఉందని అన్నారు. కానీ ఆయన మహాభారతం లో లాగా తండ్రి కూతుర్ని విడదీసి శకుని పాత్ర పోషించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నేను తండ్రి కి దూరం చేయడానికి ప్రశాంత్ రెడ్డి కీలకపాత్ర పోషించారని ఆమె ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన నెలరోజులకే వేముల ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్లో చేరేందుకు అమెరికాలో రాయబారం నడిపారని ఆక్షేపించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా కాంగ్రెస్తో చేతులు కలిపి అక్రమస్తులను కూడ పెట్టుకుం టున్నారని విమర్శించారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
మంగళవారం
01 -09-2026

సంపాదకీయం

# మృత్యు ముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనపడుతూ క్షీణిస్తున్న లక్షణాలు మనకి బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇటువంటి లక్షణాలు వ్యక్తం కావడం అనేది మాత్రం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు ఇటువంటి లక్షణాలే 1914-1945 మధ్య కాలంలో కూడా కనిపించాయి. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ జబ్బుపడ్డ వ్యవస్థ అని లెనిన్ చేసిన రోగ నిర్ధారణ సరైనదే అని అప్పుడే రుజువైంది. అప్పటికి, ఇప్పటికి తేడా అంతా వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు అది స్పందించిన తీరులోనే ఉంది. అప్పుడు ఈ వ్యవస్థ ఒక పథకం ప్రకారం కాని, లేక అనివార్యం అయినందువలన కాని తనను తాను "సంస్కరించుకోవడానికి" సిద్ధపడింది. కనీసం మూడు ప్రత్యేక విధాలుగా ఈ సంస్కరణ జరిగింది. మొదటిది- రాజకీయంగా వలస విధానానికి తెర దించడం. విన్‌స్టన్ చర్చిల్ వంటి బూర్జువా నాయకులు అప్పుడు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. వలసల మీద పెత్తనాన్ని వదులుకున్నా, మూడవ ప్రపంచ దేశాల వనరుల మీద పెత్తనాన్ని వేరే పద్ధతుల ద్వారా చెలాయించడానికి పూనుకున్నారు. రెండవది- ప్రపంచంలోని ప్రధాన పెట్టుబడిదారీ దేశాలలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని ఒక వ్యక్తి-ఒక ఓటు సూత్రం ప్రాతిపదికన అమలు చేయడం, మూడవది- నిరుద్యోగాన్ని తగ్గించి తద్వారా స్థూల డిమాండ్‌ను పెంచడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకోవడం. యూరప్‌లో ఈ చర్యల వలన భారీగా సంక్షేమ ఖర్చు పెరిగింది. అదే అమెరికాలోనైతే భారీ సైనిక వ్యయం ద్వారా రాజ్యం జోక్యం చేసుకుంది. మొదటి రెండు చర్యల వలన పెట్టుబడిదారీ వ్యవస్థ కు ఎటువంటి సవాలైనా ఎదురైతే దానిని తట్టుకుని నిలబడడానికి మూడవ చర్య తోడ్పడింది. ఆ విధంగా ఇది ముఖ్యమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థ "మానవీయ" మైనదని, "ప్రజాస్వామ్యయుత"మైనదని, దాదాపు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పన చేయగలుగుతుందని ఆ విధంగా అది సోషలిజం కన్నా ఉన్నతమైనదని చెప్పుకుని తన ఉనికికి ఎదురైన సవాలుని తట్టుకుని సంక్షోభాన్ని అధిగమించగలిగింది. తన కొత్త రూపాన్ని చూపి ప్రపంచాన్ని చాలా బలంగా నమ్మించగలిగింది కూడా. మరోవైపు మూడవ ప్రపంచ దేశాలలోని వివిధ అధినేతలను హత్యలు గావించడం, మరికొన్ని దేశాల్లో కుట్రల ద్వారా ప్రభుత్వాలను కూలదోసి తన తొత్తులను గద్దెనెక్కించడం వంటివి కొనసాగిస్తూనేవచ్చింది. మొస్సాదెహ్ నుంచి ఆర్బెంజ్ వరకు, లుముంబా నుండి అలెండీ వరకు జరిగినవి మాత్రమే కాదు, కొరియాలో, వియత్నాంలో అది సాగించిన దురాగతాల గురించి వేరే చెప్పనక్కర్లేదు. తన ఉనికికి సంక్షోభం నుంచి ఎదురైన సవాలును తట్టుకోడానికి అది ప్రారంభించిన పెట్టుబడిదారీ దశను "పెట్టుబడిదారీ విధానపు స్వర్ణయుగం" అని పిలుస్తారు. అంతకు మునుపటి పరిస్థితితో పోల్చితే ఇది సాపేక్షంగా కొత్తది, విభిన్నమైనది. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమంటే అప్పటి మాదిరిగా మార్కెట్లో డిమాండ్ ను పెంచడం కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఇప్పుడు ఇంకెంత మాత్రమూ సాధ్యం కాదు. ఇప్పుడు డిమాండ్ ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచాలంటే అందుకు ద్రవ్యలోటును పెంచడం కాని, లేదా ధనవంతుల మీద పన్నులను పెంచడం కాని చేయాలి. కార్మికవర్గం మీద పన్నులు పెంచడం వలన డిమాండ్ పెరుగుదల ఉండదు. వారి ఆదాయాలను కార్మికులు ఎటుతిరిగీ ఖర్చు చేసేస్తారు. పన్నులను వారిమీద అదనంగా వేస్తే అప్పుడు ఆ ఖర్చు తగ్గిపోయి డిమాండ్ తగ్గిపోతుంది. అప్పుడు ప్రభుత్వానికి వచ్చిన పన్ను రాబడిని ఖర్చు చేసినా మొత్తంగా చూసినప్పుడు డిమాండ్ పెరుగుదల ఏమీ ఉండదు. దానిని పక్కన పెడితే మిగిలినవి రెండు- ద్రవ్యలోటును పెంచడం లేదా ధనవంతుల మీద పన్ను పెంచడం. ఈ రెండు చర్యలనీ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు (ఎందుకంటే అత్యంత సంపన్నుల దగ్గరే ద్రవ్య పెట్టుబడి ఎక్కువగా పోగుబడి వుంటుంది). పైగా ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. కానీ, రాజ్యాలు ఇంకా జాతి రాజ్యాలుగానే కొనసాగుతున్నాయి. పెట్టుబడి దేశం నుండి పలాయనం చిత్తగించకుండా ఉండాలంటే అప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. అందుచేత ఇప్పుడు నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక మాంద్యం రూపంలో ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి ఉపశమనం పొందే దారి ఏదీ లేదు. ఆదాయాల్లో విపరీతంగా పెరిగిపోయిన అసమానతలే ఈ మాంద్యానికి దారి తీశాయి. దాంతో నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు దారి మూసుకుపోయింది. వ్యవస్థ ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినప్పటికీ, దానిని అధిగమించడానికి అది ఏమీ చేయలేని స్థితిలో ఉంది. ఇన్నాళ్లూ పెట్టుబడిదారీ వ్యవస్థ తనను గురించి తాను చిత్రించిన రూపానికి పూర్తి విరుద్ధమైన లక్షణాలను మనం ఇప్పుడు చూస్తున్నాం. అన్నింటికన్నా ముందు ప్రజాస్వామ్యం మీద వాస్తవమైన దాడి జరుగుతోంది. పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా ఇప్పుడు పచ్చి నయా ఫాసిస్టు ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి, లేదా ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి. అన్ని చోట్లా ప్రభుత్వ విధానాల మీద ప్రజాగ్రహం పెరుగుతోంది. దానిని వ్యక్తం చేసినవారిమీద మెకార్థీయిస్టు పద్ధతుల్లో వేధింపులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు ప్రపంచంలో అత్యధిక పెట్టుబడిదారీ దేశాల్లో పాలస్తీనా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హననం పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొంది. కాని ఆ దేశాల ప్రభుత్వాలు మాత్రం ఇజ్రాయిల్ కి మద్దతుగా వ్యవహరిస్తున్నాయి (ఒక్క స్పెయిన్ మాత్రమే మినహాయింపు). అంతేగాక, పాలస్తీనా మద్దతుదారులకు అనుకూలంగా ప్రజలు చేపట్టిన కార్యక్రమాలను తీవ్రంగా అణచివేస్తున్నాయి. తన దేశం ఎటువంటి అసమ్మతినైనా అనుమతిస్తుందని గర్వంగా చెప్పుకునే బ్రిటన్ ఇప్పుడు పాలస్తీనాకు అనుకూలంగా ప్రసంగించిన విద్యార్థులను "ఉగ్రవాదులు" అంటూ వారిపై కేసులు పెట్టి విచారిస్తోంది. అలా కేసులను ఎదుర్కొంటున్న వారిలో మెజారిటీ మీద ఇంతవరకూ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. ఇటువంటి పరిస్థితే తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఉంది. జర్మనీ వంటి దేశాల్లో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు చేయడాన్ని నిషేధించారు. జాతి హననాన్ని సైతం బలపరచడమే కాకుండా, రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ముందెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ హక్కులను పరిరక్షిస్తుందని చెప్పుకుంటూ వచ్చినదంతా బూటకం అని తేలిపోయింది. నయా ఉదారవాద శకంలో పెరిగిన ఈ నిరంకుశ అణచివేత విధానాలకు తోడు ఇప్పుడు అమెరికా మూడవ ప్రపంచ దేశాలను తిరిగి తన వలసలుగా మార్చుకోడానికి పూనుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్ ఈ ఎజెండాను తన ప్రసంగాల్లో వ్యక్తీకరించడమే కాక, వెనిజులా లోకి చొరబడడం, ఇరాన్ మీద సైనిక దాడులను కొనసాగించడం, గ్రీన్‌లాండ్ మీద, తక్కిన దేశాల మీద దాడులకు పథకాలను రచించడం ద్వారా ఆచరణలోకి సైతం దిగిపోయాడు. ఈ ప్రయత్నంలో అమెరికా తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాల మద్దతును కోరుతోంది. ఆ విధంగా తాను స్వేచ్ఛకు మద్దతునిచ్చే వ్యవస్థనని యుద్ధానంతర కాలంలో చెప్పుకున్నదానికి పూర్తి విరుద్ధంగా ఇప్పుడు సామ్రాజ్యవాదం వ్యవహరిస్తోంది. వలస వాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ముందుకు తెచ్చిన వాదనల ప్రభావం ఇంకా యూరప్‌లోని పెట్టుబడిదారీ దేశాల్లో ఏమైనా మిగిలి వుందేమోననే అనుమానం అమెరికాకు ఉంది.

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం: కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్:ఆగస్టు 31: **(ప్రజాగళం)**తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తు న్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు కొత్త రైల్వే ట్రాక్‌లు,వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,ఎంపీ డీకే అరుణ ఈరోజు (సోమవారం)పరిశీలించారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.మహబూబ్‌నగర్‌ను రైల్వేహబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేంద్రప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడిం చారు.తెలంగాణలో42 రైల్వేస్టేషన్లను ఏక కాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.మౌలిక వసతులకు పెద్దపీట వేస్తు న్నామని చెప్పుకొచ్చారు.2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు.

## సరికొత్త పారిశ్రామిక విప్లవం

పెద్ద, భారీ, మెగా పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షించేలా ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు అదనపు ప్రయోజనాలు కల్పించే అంశంపైనా దృష్టి సారించింది.లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు 'నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026--30'ను ఇప్పటికే తీసుకొచ్చింది. 2030 నాటికి ప్రపంచంలోని అగ్రశ్రేణి లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా పెట్టుకుంది. జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు మెడికల్ డివైసెస్, గ్రీన్ ఫార్మా, ఫార్మా విలేజీలు, బయో ఇన్నోవేషన్ వంటి విభాగాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.హైదరాబాద్‌లో ఇప్పటికే బలంగా ఉన్న ఐటీ రంగాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు 'ఐటీ పాలసీ 2.0'ను రూపొందిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డీప్‌టెక్, ఫిన్‌టెక్, డిజిటల్ ఇంజినీరింగ్ వంటి రంగాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. భవిష్యత్‌లో అధిక విలువ కలిగిన టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.ప్రపంచ కంపెనీలు చైనాకు ప్రత్యామ్నాయ తయారీ కేంద్రాల కోసం చూస్తున్న నేపథ్యంలో ఆ అవకాశాలను తెలంగాణ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

## హైదరాబాద్‌లో నర్సు దారుణ హత్య, నిందితుడు అరెస్ట్.



హైదరాబాద్:ఆగస్టు 31:(ప్రజాగళం) హైదరాబాద్ నగర శివార్లలోని తుక్కుగూడ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపిన నర్సు శిరీష దారుణ హత్య కేసును శంషాబాద్ పోలీసులు అతి తక్కువ సమయంలోనే ఛేదించారు. ప్రైమ్‌కేర్ ఆస్పత్రి సమీపంలో నివాసముంటున్న బాధితురాలిపై అత్యంత కిరాతకంగా అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన నిందితుడు సనావుల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు జరిపి ఈ కేసును ముగించారు.మృతురాలి గదికి ఆనుకుని ఉన్న మెకానిక్ షాప్‌లో పనిచేసే సనావుల్లా, గది వెనుక కిటికీ నుంచి గత నెల రోజులుగా ఆమెపై కన్నేసి ఉంచాడని దర్యాప్తులో తేలింది. అడల్ట్ కంటెంట్‌కు బానిసైన నిందితుడి ఫోన్‌లో ఇతర నర్సుల ఫోటోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శిరీషతో ఉండే మరో కేరళ నర్స్ ఓనం పండుగకు ఊరెళ్లడంతో, ఆమె ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని లోపలికి చొరబడి ఈ ఘాతకానికి ఒడిగట్టాడు.ఘటనా స్థలంలో మృతురాలి ముఖంపై గాయాలు ఉండగా, క్లూస్ టీమ్ నిందితుడి వేలిముద్రలు, వెంట్రుకలను సేకరించింది. నేరాన్ని నిర్ధారించడానికి వీటిని డిఎన్‌ఏ పరీక్షలకు పంపినట్లు డీసీపీ తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడని, ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా స్పీడ్ ట్రయల్స్ జరిపి నిందితుడికి త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## సబ్బండ వర్గాల సంక్షేమమే మా పార్టీ ధ్యేయం.

కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలపై బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. ఎన్నో హామీలతో అధికారాన్ని చేజిక్కించు కున్న కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజులైనా ఒక్క హామీ నెరవేర్చ కుండా తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పై ఇకనుండి నా పోరాటం సాగుతుందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మళ్లీ పోటీ చేస్తే చిత్తుగా ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ లో ఐదు నియోజకవర్గాల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. ఇకనుంచి భయపడే రోజులు పోయాయని తెలంగాణ ప్రజల కోసం పోరాడేందుకు సిద్ధమై మీ ముందుకు వచ్చానన్నారు. ఏడు ఏళ్లుగా నిజామాబాద్ ఎంపీగా ఉండి ధర్మపురి అరవింద్ మాధవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఒక్క పైసా నిధులు కూడా తీసుకురాలేదన్నారు. గతంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు కమిషన్లు తీసుకున్నట్టు ఆరోపణలు చేసిన ఎంపీ అరవింద్ మాధవ్ నగర్ బ్రిడ్జికి ఎంత కమిషన్ తీసుకుంటున్నాను ప్రజలకు చెప్పాలని కవిత సవాల్ విసిరారు. తప్పుడు కేసులో ఇరికించి తీహార్ జైలుకు పంపిన, నాలుగేళ్లు సిబిఐ, ఈడి ఇబ్బందులు పెట్టిన ధైర్యంతో బయటకు వచ్చానన్నారు. తప్పుడు కేసు అని సుప్రీంకోర్టు జడ్జి సీబీఐ, ఈడికి గడ్డి పెట్టారని ఆమె ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.. కొత్త వాళ్లతో పార్టీ ఏర్పాటు చేశామని తమను గెలిపించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాలని ఆమె సూచించారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ విద్య, వైద్యం తో పాటు యువతకు 20 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 2 లక్షల కోట్ల ఆదాయం సమకూర్తుందని, నిధుల కోసం కేంద్రం వద్ద చేతులు చాపల్సిన అవసరం లేదన్నారు. 22ఏ అమలు చేసి పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని కవిత ఆరోపించారు. జిల్లాలోని ఎన్ఎస్ఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ ఫ్యాక్టరీలను తెరిపించడం కోసం పోరాటం సాగిస్తామన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో నీతి, నిజాయితీ కలిగిన పరిపాలన అందిస్తామని, పేదల కన్నీళ్లు తుడిచేటోళ్ళమని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తమకు పదవులు ముఖ్యం కాదని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుం దని అన్నారు. బహుజన తెలంగాణ సాధన కోసం పని చేస్తామన్నారు. జిల్లాలో ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డిలు గతంలో ఆస్తులు ఎన్ని ఇప్పటి ఆస్తులెన్నో ప్రజలకు వివరించాలని ఆమె ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మ పురి అరవింద్ జిల్లాలో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు మెడలో వేసుకోవడానికి తప్ప రైతులకు ఎలాంటి ప్రయో జనం లేదన్నారు. రైతు బోనస్ బోగస్ అయిందని, రైతు భరోసా ఆగమైందని ఆమె ధ్వజమెత్తారు. వచ్చే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తా చాటు తామని ఆమె అన్నారు. ఈ సభలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు అలీం భాయ్, నవీన చారి, లక్ష్మీనారా యణ భరద్వాజ్, నవీన్ రెడ్డి, విజయలక్ష్మి, ప్రవీణ్, టీఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల రగడ...

వెయ్యి రోజుల పాలనపైనే ఇంతలా స్పందించిన సీఎం. కస్సున లేచిన తీరు.. మున్ముందు తన సర్కార్‌ను కాపాడుకునే క్రమంలో ఎంతలా ఎటాక్ ఎన్‌కౌంటర్లు చేయగలరో చెప్పకనే చెప్పినట్టయ్యింది. కాంగ్రెస్ యువజన విభాగానికి, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి విభాగానికి ఆయన ఆ వేదికగానే పిలుపును కూడా ఇచ్చాడు. ఆరు రోజుల పాటు వరుసగా మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన తెలపాలని. కేసీఆర్ రాజీనామా చేయాలని. వెయ్యి రోజుల పాటు ప్రభుత్వ జీతం, భత్యాలు, రక్షణ చర్యల్లో భాగంగా పెడుతున్న ఖర్చంతా కలిపి రూ. 22.24 కోట్లను కేసీఆర్ ఎలాంటి పనిచేయకుండా తీసుకున్నారు. వాడుకున్నారనే విమర్శలను నెత్తిన పెట్టింది. దీనికి గాను బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఇదో విచిత్ర పరిస్థితి ఇక్కడి రాజకీయాల్లో. ఫామ్‌హౌజ్ వీడని నేత.. వస్తావా రావా? అని మొన్నటి దాకా వెంటపడి వేధించిన సర్కార్.. ఇప్పుడు ప్రతిపక్ష వ్యూహానికి తగ్గట్టుగా తన స్టాండ్‌ను మార్చేసుకున్నది. వెయ్యి రోజులైంది ఏవీ మీ హామీలు..? అని నిరసన తెలిపి.. జనం ముందు దోషిగా నిలపాలని భావించిన బీఆరెస్‌ను.. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు పొగ పెట్టే వ్యూహాన్ని సీఎం ఎంచుకోవడం ఆ పార్టీని అవాక్కయ్యేలా చేసింది. ఒకటి తలిస్తే మరోటి ఎదురైందన్నట్టుగా ఇప్పుడు వెనక్కి రాలేరు.. ముందుకు పోలేరు.. అన్నట్టుగా తయారయ్యింది బీఆరెస్ పరిస్థితి. అందుకే సీఎం రేవంతే అంటున్నాడు.. ఇలాంటి పరిస్థితులు మరెక్కడా ఉండవు.. తెలంగాణ రాజకీయాల్లో ఇది కేసీఆర్ స్పెషాలిటీ అంటూ.. ఆయనను ఫామ్‌హౌజ్ నేతగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆరెస్ ఎంచుకున్న నిరసన ప్రదర్శనకు కాంగ్రెస్ నుంచి ఈ విధమైన కౌంటర్ ఎటాక్ రావడం.. ఇప్పుడు ఈ రెండు పార్టీలు పోటాపోటీ నిరసనలు తెలుపుకోవడం తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కిస్తున్నాయి.

## రూ.8 లక్షల కోట్ల అప్పు ఇదే కేసీఆర్ మార్క్ పాలన: సీఎం రేవంత్

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "కాంగ్రెస్ ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కొంతమంది అల్లరి మూకలు ఈరోజు మా పాలన మీద ప్రభుత్వ వైఫల్యాల మీద కార్యాచరణ తీసుకున్నాం మేము నిరసన తెలుపుతాము, మేము రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలని దగ్ధం చేస్తామని ఈరోజు బయలుదేరాయి . అసలు విషయం ఏంటంటే ధనిక రాష్ట్రంగా 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ కి అప్పజెప్పారు.ఆనాడు 70 వేల కోట్ల రూపాయల మాత్రమే అప్పు ఉండేది.సంవత్సరానికి 6,500 కోట్ల రూపాయలు అసలు మిత్తి కడితే సరిపోతుంది అంటే నెలకు 500 కోట్ల రూపాయలు ప్రభుత్వం మీద భారం పడేది. 16,000 కోట్ల రూపాయలు బ్యాంకులో మిగిలి ఉండేది . ఆ పరిస్థితుల్లో జూన్ 2, 2014 నాడు కెసిఆర్ కి అధికారం అప్పచెపితే సరిగ్గా తొమ్మిదిన్నర సంవత్సరాలలో , ఒకే ఒక్క కేసీఆర్ ఆయన కుటుంబంలోని నలుగురు కలిసి 8 లక్షల పదకొండు వేల కోట్ల రూపాయల అప్పులల్ల తెలంగాణ రాష్ట్రాన్ని నిండా ముంచి ,ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితికి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారు. 1948 నుండి 2014 వరకు 16 మంది ముఖ్యమంత్రిలు కలిసి పరిపాలన చేస్తే వారందరూ కలిసి చేసిన అప్పు 70 వేల కోట్లు.కానీ కెసిఆర్ కల్వకుంట్ల కుటుంబం తొమ్మిదిన్నర ఏళ్లలో చేసిన అప్పు ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు . ఆనాడు నెలకు 500 కోట్ల రూపాయలు కడితే సరిపోయేదని , అలాంటిది ఈనాడు నెలకు 7500 కోట్ల రూపాయలు కట్టాల్సిన పరిస్థితికి కేసీఆర్ తీసుకువచ్చాడ"ని మండిపడ్డారు. ఈరోజు నేను తిన్న తినకపోయిన, పని చేసినా చేయకపోయినా ఆరోగ్యం బాగాలేక ఇంట్లో పండుకున్న అప్పులోడు ఊరుకోడు. చంద్రశేఖర రావు చేసిన అప్పులకు ఆయన చేసిన తప్పులకు నెలకు 7500 కోట్లు అంటే సంవత్సరానికి 80 నుంచి 90 వేల కోట్ల రూపాయలు అసలు ,వడ్డీ కలిపి కట్టాల్సిందే.10 ఏళ్లలో కేసీఆర్ సాధించిన విజయమే ఏదైనా ఉంది అంటే అది 70 వేల కోట్ల రూపాయల ఉన్న అప్పుని 8 లక్షల పదకొండు వేల కోట్ల రూపాయలకే తీసుకెళ్లడమే అంటూ మూసారాంబాద్ వంతెన ప్రారంభోత్సవంలో మండిపడ్డారు సీఎం రేవంత్ !

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
మంగళవారం
01 -09-2026

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.



నిజామాబాద్ ఆగస్టు 31 (ప్రజాగళం ప్రతినిధి ) రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ.



నిజామాబాద్, ఆగస్టు 31 ( ప్రజా గళం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో గైని పాత్ర కీలకం.

## గైని గంగారం సేవలను కొనియాడిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.



నిజామాబాద్, ఆగస్టు 31( ప్రజా గళం ):తెలంగాణ రాష్ట్ర సాధనలో టీఎన్జీవోస్ నాయకుడు గైని గంగారం పాత్ర కీలకమని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్లో టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో జరిగిన గైని గంగారం పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైని గంగారాం ఉద్యోగ సంఘ నాయకులుగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత దక్కిందని కొనియాడారు.గత 40 సంవత్సరాలుగా నీటిపారుదల శాఖలో విధులు నిర్వహిస్తూ సూపరింటెండెంట్ గా సోమవారం పదవి విరమణ చేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారాం కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా గైని దంపతులను అతిధులు శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుసేని ముజీబ్, టీఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, రైతు కమిషన్ రాష్ట్ర సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి కోలా శ్రీనివాస్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, కోశాధికారి నిరంజన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్,జాఫర్ హుస్సేన్,శ్రీనివాస్,మాణిక్యం, జాకీర్ హుస్సేన్,జ్ఞానేశ్వర్ రెడ్డి, నృజన్ కుమార్, ప్రవీణ్ రాజ్, సూర్యప్రకాష్,కార్తీక్,మారుతి, గీతారెడ్డి,మంగారెడ్డి శ్రీ వేణి, రాజేశ్వర్,గురు చరణ్,టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై గైనికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయండి.

## –ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి వెల్లడి



నిజామాబాద్ సిటీ, ఆగష్టు 31( ప్రజాగళం ) ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయాలని ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి వెల్లడించారు. .సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్వో లకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.డిఎంహెచ్ఓ ఛాంబర్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పాఠశాలలో కళాశాలలో ఆరోగ్యం పైన అవగాహన కలిగించాలని, జీవనశైలి వ్యాధులపై, క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ ఊబకాయానికి గురికాకుండా చూడాలన్నారు.కాలేజీలలో మిస్టర్ అండ్ మిస్ట్రెస్ లను ప్రోత్సాహిస్తూ మారథాను రన్నింగ్ కాంపిటీషన్లను నిర్వహించాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రోత్సాహంగా అందించాలన్నారు. టీబీ,ఎంబీఏ లో భాగంగా ప్రతి కుటుంబాన్ని, డ్వాక్రా మహిళలను, బీడీ వర్కర్లను ప్రభుత్వ ఆధీనంలోని వి ఏ ఓ లు ,విలేజ్ సెక్రటరీలను, మెప్మా మెంబర్లను ఉపయోగించి కౌన్సెలింగ్, అవగాహన కలిగించాలన్నారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా మెడికల్ కాలేజ్ విద్యార్థులతో ప్రతి మండలంలో హెచ్ఐవి,ఎయిడ్స్ పైన అవగాహన కలిగించాలని అన్నారు. ఆశ కార్యకర్తల్లో ఆరోగ్యంపై అవగాహన విస్తృతంగా కలిగించి వారి సేవలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తి వ్యాధి నిరోధక టీకలను 100 శాతం ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైతే వ్యాధి నిరోధక టీకాలకు వ్యతిరేకత ఉన్నదో అక్కడ వారికి విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న ఔషధాలపై విస్తృతంగా అవగాహన కలిగించాలని, వైద్యధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. వైద్యాధికారులకు నెలకోసారి ఫిజికల్ సమావేశం నిర్వహించాలని సూచించారు.. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసినప్పుడే తేరిసియరి ఆరోగ్యం పై భారం పడదన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ కొత్త దనాన్ని, సృజనాత్మకత దృష్టితో సాధారణ సేవలకు భిన్నంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మాతాశిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా జరిగితే ఎందుకు జరిగినాయి అని కారణాలను వెతికి అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో అన్ని జాతియా ఆరోగ్య కార్యక్రమాలపై డిఎంహెచ్ఓ రాజశ్రీ మేడం వివరించారు.ప్రోగ్రాం అధికారులు వారి వారి కార్యక్రమాలపై నివేదిక ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ బేబీ నాగేశ్వరి, డి ఐ ఓ డాక్టర్ అశోక్, ఏఓ సుమంత్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విద్య, సికందర్ నాయక్, డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ అంజన, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భార్గవి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ కీర్తన, ఎస్ఓ రాజేశ్వర్ , ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ,డిపిఓ విశాల, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# 11 మంది హెడ్ కానిస్టేబుళ్ల కు ఏఎస్ఐలుగా పదోన్నతి.

## అభినందించిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.




నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 31 ( ప్రజా గళం ) నిజామాబాద్ జిల్లాలో 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. వారిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశానుసారము నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఎ.యస్.ఐ లు గా పదోన్నతి సాధించిన సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్న హెడ్ కానిస్టేబుళ్ల కు ఎ.యస్.ఐ లు గా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి 11 మంది ఎ.యస్.ఐ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.పదోన్నతి పొందినటువంటి వారి వివరాలు. యస్.గంగాధర్ రావు ,పి. రాజేశ్వర్ , పి. మోహన్ , బి.జగదీశ్,పి.చిన్న సాయిలు , జె.రాజశేఖర్ , జి.రాజేందర్ , పి.సుదర్శన్ ,కె. డేనియల్ భాస్కర్ ,కె. సుంకన్న,కె. మల్లేశం లు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు.

# తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు న్యాయం జరగాలి.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కవితకు విజ్ఞప్తి.




నిజామాబాద్ సిటీ ఆగస్టు 31 (ప్రజాగళం) తెలంగాణ రాష్ట్రంలోని మాదిగ కులాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లమారి సుధాకర్ మాట్లాడుతూ,రాష్ట్రంలో మాదిగలు సుమారు 60 లక్షల మంది ఉన్నట్లు తెలిసిందే.అన్ని కులాల కంటే రాష్ట్రంలో మాదిగలే ఎక్కువగా ఉన్నారు. కానీ మాదిగలకు దేనిలోనూ ప్రాధాన్యత లేక పోవటం విచారించదగిన విషయం అని అన్నారు. మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యత లేదనీ,మాదిగలకు లోన్లు, ఇండ్లు ఇవ్వరనీ, ఇండ్ల పంపకంలో పూర్తిగా అన్యాయం జరుగుతుందనీ సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాదిగలకు పూర్తి న్యాయం చేయాలని లేఖలో కవితను కోరారు. అదేవిధంగా ఇప్పటి వరకు నిజామాబాద్ లో మాదిగలకు కళ్యాణ మంటపాలు లేవని. మాదిగ భవనం లేదని. అన్ని కులాలకు ఎకరాలకు ఎకరాలు పంచిన ప్రభుత్వాలు మాకు ఎందుకు భూమి ఇవ్వటం లేదనీ కవితకు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు..గతంలో మాదిగల పేరు చెప్పి ఓట్లు వేయించుకుని ప్రభుత్వాన్ని చేపట్టిన తర్వాత ఏ రంగంలోనూ ప్రాధాన్యతను ఇవ్వకుండా మాదిగలను అట్టడుగున తొక్కారని ఆరోపించారు.వేల సమస్యలు, వందల ప్రశ్నలు ఏ ప్రభుత్వం కూడా పరిష్కరించలేదు. రాబోయే రోజుల్లో మీ ప్రభుత్వం ఏర్పాటయితే మా మాదిగల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కవితకు వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

### ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్.



ఆర్మూర్ ఆగస్టు 31 ( ప్రజా గళం) విద్యార్థులు గంజాయి ,డ్రగ్స్ మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో మన ఊరు– మన భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. యువత పేడ త్రోవపడకుండా గంజాయి ,డ్రగ్స్ మత్తు పదాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణవేణి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పోయిన ఫోన్లను అందజేసిన ఎస్ హెచ్ ఓ ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ అందజేశారు. సోమవారం బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందజేశారు. అందజేసిన వారిలో హైమత్ అలీ వెంకటకృష్ణ మహ్మద్, దుమ్బిర్యాల శ్రీకర్ నేరేడు లింగారెడ్డి రాజేష్ రమేష్ లకు ఫోన్లను అందజేశారు.

## డ్రగ్స్ ట్రాఫిక్ నియమాలు సైబర్ నేరాలపై ఎస్ హెచ్ ఓ , అవగాహన సదస్సు..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్ట్ 31 (ప్రజాగళం): ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్లో మన కాలనీ మన భద్రత మన బాధ్యత విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ట్రాఫిక్ నియమాలు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన మన కాలనీ మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్మూర్ పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్ ట్రాఫిక్ నియమాలు మరియు సైబర్ నేరలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు దేశ భవిష్యత్తు మత్తు పదార్థాల డ్రగ్స్ బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్ట వ్యతిరేకమని విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉండాలని తెలియని లింకులను క్లిక్ చేయవద్దని సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జోర్ధారగా కొనసాగిన ఉచిత మేఘ ఆరోగ్య శిభిరం



జక్రాన్ పల్లి డిసెంబర్ 31:- నిజామాబాదు జిల్లా జక్రాన్ పల్లి మండలోని గన్య నాయక్ తండాలో ఉచిత మేఘ ఆరోగ్య శిభిరం ఆదివారం జోర్ధారగా కొనసాగింది. డాక్టర్ ఆజ్మీర ప్రకాష్ ఆధ్వర్యంలో తల్లి తల్లి దూరి బాయి, తండ్రి బిక్యా నాయక్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన శిబిరంలో లక్ష్మీ శైలజ "బెడ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ "మల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్,మరియు నిజామాబాదు ప్రముఖ వైద్యులైన స్త్రీ రోగ నిపుణురాలు, డాక్టర్ శైలజ

కళ్యాణి,చంద్రమోహన్,హృదయ నిపుణులు కూరుపాటి కార్తీక్,కళ్యాణ్,ఊపిరి తిత్తుల నిపుణులు రాజేశ్వర్ వైష్ణవి అతిర , ప్రభుత్వ మెడికల్ కాలేజీ సహాయక ప్రొఫెసర్ సుజాత తదితరులు పాల్గొనగ రోగులకు ఉచితంగా మందులు అంధజేశారు. డా,అజ్మీర ప్రకాష్ పుట్టిన ఊరికి ఉపకారంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ప్రముఖ డాక్టర్ల బృందంతో ఇలాంటి మెడికల్ క్యాంపు నిర్వ హిస్తూ పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినంద నీయమని డాక్టర్ ప్రకాష్ గురువైన బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు అభినందించారు. పైగా గ్రామానికి రూ,2,30,000/- "వైకుంఠ రతాన్ని"చేయించి ఇచ్చారని ఊర్లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సంవ త్సరశీ ఉచితంగా దుస్తులు పంపిణి చేస్తున్నారని, ఒకే కుటుంబంలో అందరూ డాక్టర్లే నని గ్రామానికి చెందిన చెందర్ నాయక్ వివరించారు.

డా,ప్రకాష్ హైదరాబాద్ లో సూరారం లో మల్లారెడ్డి నారాయణ ఆసు పత్రి లో హృదయ రోగుల సీనియర్ కన్సల్టెంట్ 2010 లో చేరి ఈ రోజు వరకు 12,000 కంటే ఎక్కువ ఓపెన్ హార్ట్, సర్జరీల తో పాటు గుండె (హార్ట్)లో స్టంట్స్ వేయడంతో ఎందరోమందికి ప్రాణాలు కాపాడిన "వైద్య.నారాయనో హరి" అంటూ గన్య నాయక్ తాండ లో పుట్టిన "దేవుడని" చెప్పుకుంటారు.

నేటి సమాజానికి ఉపయోగ పడే విధంగా ఒకే కుటుంబంలో ఐదుగురు డాక్టర్లు కావడం ఈప్రాంతానికే గర్వ కారణమని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నేషనల్ యూత్ ప్రాజెక్ట్ యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనై జేషన్ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు అధ్యక్షులు మోతె రామ గౌడ్, సెక్రెటరీ జనరల్ బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు హర్షం వ్యక్తం చేశారు.

## ఇరిగేషన్ రోడ్డు కబ్జా

### మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు



ఆర్మూర్ ఆగస్టు 31 (ప్రజాగళం)ఆర్మూర్ పట్టణంలోని 26వ వార్డు రాజారాం కాలనీలో గల ఇరిగేషన్ స్థలం యదేచ్ఛగా కబ్జాకు గురవుతుందని కాలనీవాసులు బీజేవైఎం టౌన్ జనరల్ సెక్రెటరీ పెద్దోళ్ల భరత్ , కొత్తూరు ఆనంద్ , అవిశెట్టి నారాయణ, రుద్ర రవి గట్ల గణేష్ లు మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా 20వ వార్డులో కెనాల్ కట్ట ఆనుకొని ఇరిగేషన్ స్థలం కబ్జాకు గురవుతుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మశానానికి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. గత కొంతకాలంగా కొందరు రాజకీయ పలుకుబడిన ఉపయోగించి యదేచ్ఛగా స్థలానికి కబ్జా చేస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నించినప్పటికీ ఏం చేస్తారో చేసుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరిగినా ఇటు మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లక్షలు విలువ చేసే స్థలాన్ని ఇరిగేషన్ స్థలాన్ని ఆనుకొని ఉన్న కొందరు కబ్జా చేయడంపై ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని గుర్తించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

నిజామాబాద్, ఆగస్టు 31 (ప్రజాగళం) రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

### - సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ ఆగస్టు31: (ప్రజాగళం) నిజామాబాద్ నగరంలో ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత తీర్చిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా ఆగస్టు 31 (ప్రజాగళం): ఆర్మూర్ పట్టణం తోపాటు కొన్ని గ్రామాలలో గత కొన్ని నెలలుగా యూరియా యాప్ డౌన్లోడ్ కాకపోవడం డౌన్లోడ్ అయితే యూరియా బుక్ కాకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బంది పడ్డారు ఇట్టి విషయాన్ని ప్రజావాణిలో మరియు సబ్ కలెక్టర్ ఎమ్మార్వో వ్యవసాయ అధికారులకు విన్నవించడం జరిగింది. మరియు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గారి దృష్టికి ఆర్మూర్ ఆరు పంటల రైతు సంఘం ప్రతినిధితో ఈ యాప్ గురించి తీసుకెళ్లగా వారు విని వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు గౌరవనీయులు శ్రీ తుమ్మల నాగేశ్వరావు గారితో మాట్లాడి యాప్ డౌన్లోడ్ అయ్యే విధంగా యూరియా బుక్ ఏ విధంగా చేయాలో చూడడం జరిగింది పట్టణ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ గౌరవ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి ఆర్మూర్ ఎమ్మెల్యే గౌరవ పైడిరాకేష్ రెడ్డికి జిల్లా కలెక్టర్కు సంబంధిత వ్యవసాయ అధికారులకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపిన ఆర్మూర్ పట్టణ రైతు సంఘం ప్రతినిధులు రైతులు మాట్లాడుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి రైతు పక్షపాతి అని అర్బన్ రైతు ప్రతినిధులు తన దృష్టికి యూరియా పరిష్కారం చేయాలని చెప్పగానే పరిష్కారం చూపడం చాలా అభినందనీయమని ఈ సమ యంలో మొక్కజొన్నకు వరికి యూరియా చాలా అవసరమని యూరి యా వాడకుంటే దిగుబడి చాలా తగ్గేదని సరైన సమయంలో రైతులకు యూరియా పరిష్కారం చేయడం జరిగిందని అన్నారు గతంలో కూడా రైతులకు వడ్ల కొనుగోలు విషయంలో సంబంధిత అధికారులకు మాట్లాడి వెంటనే కొనుగోలు అయ్యే విధంగా చూశారని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కి రైతు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలికోట గంగాధర్ మగ్గిడి రాజేశ్వర్ బొల్లు పోతన్న నారడి మల్లయ్య డబ్బా లింగం భూపతి రెడ్డి దోమకొండ రవీందర్ నక్కల బాజన్న, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com